జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 19 | జనవరి | 2025 ◆ పేజీలు : 5



# ఆయుధాలను,అజ్ఞాతాన్ని వీడండి...

### అరణ్యవాసం వీడండి.. పునరావాసం పొందండి..

### మీ సంక్షేమం.... మా భాద్యత...

# జనజీవన స్రవంతిలో కలవండి..

*కొత్తగూడెం క్రైమ్, జనవరి 18, ప్రజాజ్యోతి:*

ఆయుధాలను, అజ్ఞాతాన్ని వీడండి...జనజీవన స్రవంతిలో కలవండి..అరణ్యవాసం వీడండి.. పునరావాసం పొందండి..మీ సంక్షేమం....మా భాద్యత అని జిల్లా ఎస్పి రోహిత్‌రాజు మావోయిస్టులకు పిలుపునిచ్చారు. శనివారం చర్ల పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు

మిగతా 2 లో...



# అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

- కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతా
- విమానాశ్రయం, కార్పొరేషన్ కల సాకారం కాబోతోంది
- క్రీడాభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తున్నాం
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు
- రూ.45 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

*కొత్తగూడెం, జనవరి 18, ప్రజాజ్యోతి:*

కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలకు శాశ్వత పరిస్కారం చూపడమే ప్రధాన ఎజెండాగా చేసుకొని అనునిత్యం శ్రమిస్తున్నానని, అవధులు లేని అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించి కొత్తగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నిలుపుతానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పునరుద్ఘటించారు. కొత్తగూడెం

మిగతా 2 లో...

# నిరుపేదల పెన్నిధి ఎన్టీఆర్ : ఎమ్మెల్యే తెల్లం

*భద్రాచలం, జనవరి 18 (ప్రజాజ్యోతి):*

నిరుపేదల పెన్నిధి స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు అని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం పట్టణంలోని కూనవరం రోడ్ లో టీడీపీ అభిమానుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఆనాడు ఎన్టీఆర్ పేదప్రజల కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, రూ.2కే కిలోబియ్యం ఇచ్చారని, ఎన్నో పథకాలు చేపట్టి నిరుపేదల గుండెల్లో ఎన్టీఆర్ గూడు కట్టుకున్నారని

మిగతా 2 లో...



# రూ.11 లక్షల గంజాయి పట్టివేత

- ఇద్దరు వ్యక్తులు అరెస్టు
- కారు, రెండు సెల్ ఫోన్ స్వాధీనం

*భద్రాచలం, జనవరి 18 (ప్రజాజ్యోతి):*



ఒరిస్సా నుంచి ఉత్తరప్రదేశ్ బాండా జిల్లాకు కారులో అక్రమంగా తరలిస్తున్న 31.06 కిలోల గంజాయిని శనివారం భద్రాచలం సమీపంలో ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు పట్టుకున్నారు. ఇన్నోవా కారులో బాండా జిల్లాకు చెందిన అంజనీకుమార్, సంజీవ్ కుమార్ లు గంజాయి తీసుకువస్తున్నారని సమాచారం అందడంతో ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు భద్రాచలం చెక్పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించి కారును పరిశీలించగా రూ. 11లక్షల విలువైన గంజాయి ఉన్నట్లు గుర్తించి గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులు, రెండు సెల్ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీఐ సీహెచ్ శ్రీనివాస్, హెడ్కానిస్టేబుళ్లు ఎంఏ కరీం, కానిస్టేబుల్ సుధీర్, వెంకటేశ్వర్లు, హరీష్, విజయ్, ఆనంద్, హనుమంత్, ఉపేందర్లు పాల్గొన్నారు.



# రేపటి లోగా సంక్షేమ పథకాల సర్వే పూర్తి చెయ్యాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశం

*కొత్తగూడెం కలెక్టరేట్ జనవరి 18 ప్రజాజ్యోతి*

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన నాలుగు సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వేను రేపు సాయంత్రం లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లాలోని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, జెడ్పి సీఈవో, ఆర్డీవోలు, తాసిల్దార్ లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, సర్వే పురోగతిపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారుల సర్వే ప్రక్రియను రేపు సాయంత్రం లోగా పూర్తిచేసుకుని, గ్రామ సభల నిర్వహణకు సిద్ధమవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో మహిళా లబ్ధిదారుల

మిగతా 2 లో...

## ఆయుధాలను,అజ్ఞాతాన్ని వీడండి... జనజీవన స్రవంతిలో కలవండి..



(మొదటి పేజీ తరువాయి...)

గత సంవత్సర కాలం నుండి లొంగిపోయిన మావోయిస్టు సభ్యుల కుటుంబాలు, జిల్లా నుండి అజ్ఞాతంలో ఉన్న వారి కుటుంబాలతో ఆత్మీయ సమ్మేళనాన్నిఏర్పాటు చేశారు.ఇందులో భాగంగానే చత్తీస్గడ్ రాష్ట్రం,సుక్మాజిల్లా ఎర్రపల్లి RPC కి చెందిన 22 మంది మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యులు శనివారం జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిన వారికి అందిస్తున్న పునరావాస పాలసీకి ఆకర్షితులై ఈ 22 మంది మిలీషియా సభ్యులు లొంగిపోవడం జరిగిందని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పంకజ్ పరితోష్,భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ లు కూడా హాజరయ్యారు. గత సంవత్సర కాలంలో లొంగిపోయిన 36 మంది మావోయిస్టు పార్టీ సభ్యుల కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలియజేసారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం లొంగిపోయిన వారికి అందిస్తున్న ప్రతిఫలాలను వెంటనే వారికి అందేలా పోలీస్ శాఖ బాధ్యత తీసుకొని పనిచేస్తుందని తెలిపారు.గత సంవత్సరంలో జిల్లా నుండి మావోయిస్టు పార్టీలో వివిధ కేడర్లలో అజ్ఞాత జీవనాన్ని గడిపి జిల్లా పోలీసులు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై 36 మంది సభ్యులు లొంగిపోవడం జరిగిందని తెలియజేసారు.ఇంకా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి అజ్ఞాత జీవితాన్ని గడుపుతున్న వారు కూడా లొంగిపోయి కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవనాన్ని గడపాలని విజ్ఞప్తి చేశారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ విద్య, వైద్యం,రవాణా సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేస్తుందని అన్నారు.జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తూ అక్కడ చదువుకునే యువత ఉద్యోగాలు సాధించే విధంగా , వారికి అవసరమైన సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా వారు ఎదుర్కొంటున్న కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు విషయంలో జిల్లా కలెక్టర్ , ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అట్టి సమస్యను అతిత్వరలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు అందే విధంగా చేస్తామని అన్నారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన నిషేధిత సిపిఐ మావోయిస్టులకు ఎవ్వరూ సహాయ సహకారాలు అందించవద్దని కోరారు. అనంతరం లొంగిపోయిన సభ్యులు, వారి కుటుంబాలకు ఏర్పాటు చేసిన సహపంక్తి విందులో పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా ఏర్పాటు చేసిన చర్ల సీఐ రాజు వర్మ, దుమ్ముగూడెం సీఐ అశోక్,ఎస్సై నర్సిరెడ్డి , పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.





## అభివృద్ధి, ప్రజాసమస్యల పరిస్కారమే ప్రధాన ఎజెండా

(మొదటి పేజీ తరువాయి...)

మున్సిపాలిటీ 27వ వార్డులో పరిధిలోని ప్రగతి మైదానంలో రూ.20లక్షలు, అదేవిధంగా రూ.25లక్షల వ్యయంతో చేపట్టనున్న ఎంపవర్మెంట్ సెంటర్ అభివృద్ధి పనులకు శనివారం కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలకు జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణాన్ని నగరాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నానని, ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించానని తెలిపారు. ప్రజల అవసరాలు గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో వివిధ పథకాల్లో నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతున్నామని, అభివృద్ధి విషయంలో రాజకీయాలని తావుండబోదని, సమస్యలులేని ప్రతి వార్డు, ప్రతి పంచాయతిగా తెర్చిదిద్దే వరకు విశ్రమించబోనను స్పష్టం చేశారు. నిర్లక్ష్యానికి గురైన క్రీడారంగంపై దృష్టిసారించానని, అందుబాటులో ఉన్న క్రీడామైదానాలను, ఓపెన్ జిమ్ములను సకల సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతోపాటు పంచాయతి కేంద్రాల్లో క్రీడాకారులకు కావాల్సిన ఏర్పాట్లు చేసి క్రీడలను, క్రీడాకారులని ప్రోత్సహిస్తానని తెలిపారు. సామాన్యులకు సైతం అందుబాటులో వుండే విధంగాని కొత్తగూడెంలో



విమానాశ్రయం నిర్మాణం, హరిత హోటల్, అభివృద్ధికి బాటలువేసే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం తన కల అని వీటిని సాకారం చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. అభివృద్ధిపనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, చైర్పర్సన్ సీతాలక్ష్మి, తహసీల్దార్ పుల్లయ్య, శేషాంజన్ స్వామి, డీఈ రవీందర్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, ధర్మరాజు, విజయ్ కుమార్, రూక్మెందర్ బండారు, అంబుల వేణు, లక్ష్మణ్, నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, యూసుఫ్, నెరేళ్ల శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, లింగేష్, జోసెఫ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిరుపేదల పెన్నిధి ఎన్టీఆర్ : ఎమ్మెల్యే తెల్లం

(మొదటి పేజీ తరువాయి...)

కొనియాడారు. ప్రతిఒక్కరూ ఎన్టీఆర్ ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకులు కొడాలి శ్రీనివాస్, షేక్ అజీమ్, కంభంపాటి సురేష్కుమార్, కుంచాల రాజారాం, కోనేరు రాము, అడుసుమిల్లి జగదీష్, చల్లగుళ్ల నాగేశ్వరరావు, కొర్లపాటి రాము, దేశప్ప, అబ్బినేని శ్రీనివాసరావు, తాళ్లూరు చిట్టిబాబు, దాసయ్య, శ్రీనివాసరావు, రేపాక రాంబాబు, సీత, అచ్యుతరావు, వెంకటేశ్వర్లు, చంటి, అశోక్ కుమార్, శ్రీను, బీఆర్ఎస్ నాయకులు ఆకోజు సునీల్ కుమార్ , కాంగ్రెస్ నాయకులు పరిమి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## రేపటి లోగ సంక్షేమ పథకాల సర్వే పూర్తి చెయ్యాలి

(మొదటి పేజీ తరువాయి...)

కింద తెలిపిన వివరాలను నమోదు చేయాలని వివరించారు. కుటుంబంలో మహిళల బ్యాంక్ అకౌంట్ ను నమోదు చేయాలని సూచించారు. రేషన్ కార్డ్ లో కుటుంబ సభ్యుల పేర్లు నమోదుకు వివిధ దశల్లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులు అన్నిటిని పరిశీలించి, వాటిని కూడా గ్రామసభల్లో పొందుపరచాలని సూచించారు. అదే విధంగా జాబితాలో లేనటువంటి అర్హులను గుర్తించి వారి దరఖాస్తులను కూడా స్వీకరించి, నిర్దేశిత ఫారంలో పొందుపరచాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ను తప్పకుండా పూర్తి చేయాలని, పేదలలో నిరుపేదలకు మాత్రమే లబ్ధి చేకూరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎంపిక చేపట్టాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే లో ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలన్నారు.

## గుడుంబా పట్టివేత మహిళపై కేసు నమోదు

*టేకులపల్లి, జనవరి 18, ప్రజాజ్యోతి:*



మండలంలోని బోడ బజార్ లో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 2 లీటర్ల గుడుంబాను ఎక్సైజ్ పోలీసుల పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ తెలిపిన వివరాలు ప్రకారం శనివారం బోడ బజార్ ధరావత్ సక్రి ఇంటిలో నాటుసారా కాస్తూ అక్రమంగా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్సె అచ్చారావు సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించగా 2 లీటర్ల నిషేధిత గుడుంబాను పట్టుకున్నామని తెలిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకొని ఆమె పై కేసు నమోదు చేసినట్లు సిఐ రాంప్రసాద్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సె అచ్చారావు, హెడ్ కానిస్టేబుల్ బాబా, కానిస్టేబులు చారీ, తులసియా తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు



*భద్రాచలం, జనవరి 18 ప్రజాజ్యోతి:*

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణతులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## సంక్షేమ పథకాల సర్వేను వేగవంతం చేయాలి - అదనపు కలెక్టర్ వేణుగోపాల్

*కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 18 ప్రజాజ్యోతి:*



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించనున్న రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశానుసారం సంక్షేమ పథకాల అమలులో భాగంగా చేపడుతున్న సర్వే పురోగతిపై జిల్లాలోని తాసిల్దార్లు ఎంపీడీవోలతో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు గాను వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 6000 చొప్పున రెండు విడతలుగా రూ. 12,000 భూ భారతి పోర్టల్ లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా చెల్లిస్తుందని, అలాగే ఇళ్లు (లేదా) కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు రియల్ ఎస్టేట్ భూములు లేఅవుట్ చేసిన భూములు నాలా కన్వర్షన్ చేసిన భూములు మైనింగ్ చేస్తున్న భూములు గోదాములు నిర్మించిన భూములు వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు రాళ్ళు రప్పలు గుట్టలతో నిండి సాగుకు అనువుగా లేని భూములను గుర్తించి తొలగించాలని సూచించారు. రైతు భరోసా పథకం అమల్లోకి భాగంగా జిల్లాలోని 354 రెవెన్యూ గ్రామాలలో భూసర్వే నిర్వహించి ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలన్నారు. 354 రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటివరకు 194 రెవెన్యూ గ్రామాల సర్వే పూర్తి అయిందని మిగిలిన 160 రెవెన్యూ గ్రామాల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కొత్త రేషన్ కార్డు మంజూరులో భాగంగా ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా జిల్లాలో 29141 దరఖాస్తులు వచ్చాయని అదేవిధంగా రేషన్ కార్డులో కొత్త సభ్యులను జతపరచడానికి గాను 10796 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ దరఖాస్తులన్నింటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశిత పట్టిక ద్వారా ప్రతి రోజు సాయంత్రం నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకుని జాబితాలో పేరు రాని అర్హుల వివరాలను కూడా నిర్దేశిత పట్టికలో నమోదు చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. లబ్ధిదారుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

# ప్రతీ కాలువ ప్రతీ లైను పరిశుభ్రంగా ఉంటాయి - మున్సిపల్ చైర్మన్





**ఇల్లందు, జనవరి 18, ప్రజాజ్యోతి:**

పట్టణంలోని ప్రతి వార్డులో కాలువ ప్రతి లైను పరిశుభ్రంగా ఉంటాయని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ లు స్పష్టం చేశారు. శనివారం ఇల్లందు పట్టణంలో స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్, కమిషనర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సహకారంతో పట్టణాలలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపాలిటీ అంతా పరిశుభ్రంగా తయారు కావాలని ప్రతి కాల్వ ప్రతి లైన్ శుభ్రంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో చెత్తను బయట వెయ్యవద్దని, వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుద్ధ కార్మికుల శ్రమ వృధా కానివ్వవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకు షావలి, డిఈ మురళి, హరి హర క్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్ గందె సదానందం, వార్డు కౌన్సిలర్లు వారా రవి, కటకం పద్మావతి, సయ్యద్ ఆజామ్, ఎలమందల వీణ, చీమల సుజాత, ఏఈ శంకర్, శానిటరీ ఇన్స్పెక్టర్, మున్సిపాలిటీ జవాన్లు, పరిశుద్ధ కార్మికులు, నాయకుడు నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కుసుమహరనాథ 80వ ఆనందమేలోత్సవాలు

**ఇల్లందు, జనవరి 18, ప్రజాజ్యోతి:**

కుసుమహరనాథ 80వ ఆనందమేలోత్సవాలను ఇల్లందు కుసుమహరనాథ ప్రచారసంస్థ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో భక్తులు జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. కుసుమహరనాథ సేవ సమితి అధ్యక్షుడు పుల్లూరుస్వరాజ్ గుప్త మాట్లాడుతూ కుసుమహరనాథ 80వ ఆనందమేలోత్సవాలను చాలా ఘనంగా నిర్వహిస్తామని, ఇల్లందులోనే కాకుండా ప్రతి ఏటా వివిధ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఆనందమేలోత్సవాలు జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. ఈ పూజలలో పాల్గొనే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. 3 రోజులపాటు వివిధ పూజ కార్యక్రమాలు చాలా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు ఉంటాయని, మొదటిరోజు ప్రభాత సేవ, ప్రభాత సంకీర్తన, జ్యోతి ప్రజ్వలన, ఉపన్యాసాలు, సామూహిక సంకీర్తనలు, రెండవ రోజు కుసుమారనాథ లీల కళ్యాణం, సామూహిక రక్తదాన కార్యక్రమం, నారాయణ సేవ, చిన్నారులచే బాలానందం కార్యక్రమాలు, 3వ రోజు ఉదయం 5గంటల నుండి జై హరినాథ జయ కుసుమ కుమారి జయనామ సంకీర్తన కార్యక్రమం ప్రారంభించుకొని వస్త్రధానం,




రాత్రి 7 గంటలకు పట్టణ పురవీధులలో కుసుమహరనాధుల ఊరేగింపు అనంతరం దివ్య హారతితో ఈ కార్యక్రమం ముగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రచార సంస్థ హైదరాబాద్ అధ్యక్షుడు తోట కరంచంద్, ఆర్. నరసింహారావు, ఆర్. వీరభద్రరావు, పుల్లూరు హరినాథ్, పుల్లూరు సదానందం, రామ్మోహన్ రావు, సురేష్, నవీన్, ప్రచార సంస్థ కర్త పుల్లూరు జ్యోతి, సుజాత, నవ్య శ్రీ, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

**ఇల్లందు, జనవరి 18, ప్రజాజ్యోతి:**

టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు 29వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని కమ్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక బుగ్గవాగు బ్రిడ్జి పై గల ఎన్టీఆర్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుగ పురుషుడు, తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మాజీ ముఖ్యమంత్రివర్యులు స్వర్గీయ నందమూరి తారకరామారావు అని కొనియాడారు. ఆహార భద్రత, పక్కా ఆవాసం కల్పించడమే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేసి పేదల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. తెలుగు జాతి, తెలుగు సంస్కృతికి, తెలుగు భాషకు ఎనలేని సేవలందించిన తెలుగు వెలుగు ఎన్టీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ, కమ్మ సంఘం పట్టణ అధ్యక్షులు కుప్పగండ్ల రవీంద్రనాథ్, మున్సిపల్ కౌన్సిలర్లు వారా రవి, కటకం పద్మావతి, ఎలమందల వీణ, చీమల సుజాత, కమ్మ సంఘం నాయకుడు చాగంటి కృష్ణమూర్తి, టిడిపి నాయకుడు చాందవత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

### మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్

**టేకులపల్లి, జనవరి 18, ప్రజాజ్యోతి:**

త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీ సత్తా చాటాలని ఇల్లందు నియోజకవర్గం బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ బీఆర్ ఎస్ నాయకులకు సూచించారు. సుఖాలబోడు గ్రామపంచాయతీలో శనివారం బిఆర్ఎస్, కార్యకర్తలతో, గ్రామస్తులుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి అని వారు అన్నారు . ముందుగా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించుకోవాలని వారు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఎక్కువ సంఖ్యలో గెలిపించాలని వారు మండల నాయకులను కోరారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, మన తెలంగాణ ప్రజలకు ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీల అమలలో అసమర్థవంతంగా పూర్తిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాన్ని గ్రామ గ్రామాన తెలిపే విధంగా ప్రచారాలు జరపాలని అలాగే గత బిఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు, రైతుబంధు, రైతు రుణమాఫీ, దళిత బంధు ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను ఎంతో సమర్థవంతంగా పూర్తి చేసిన ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు, మండల అధ్యక్షులు బొమ్మర్ల వరప్రసాద్, మాజి ఎంపీటీసీ బాల కృష్ణ, బిఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలువురు నివాళులు

### నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన యుగ పురుషుడు ఎన్టీఆర్



**టేకులపల్లి, జనవరి 18, ప్రజాజ్యోతి:**

తెలుగుదేశం వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా రాజకీయ నాయకులు, అభిమానులు, గ్రామస్తులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అన్న సూక్తిని మొదటిసారిగా రాజకీయాలకు పరిచయం చేసిన మానవతావాది నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన సమతావాది స్త్రీలకు సాధికారతనిచ్చిన సంస్కర్త స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఆ మహానాయకుని స్మృతికి నివాళులర్పిద్దాం అని వారు తెలిపారు. ఎన్టీఆర్ ఆశయ సాధనలో అనుక్షణం పనిచేస్తామని, ఆయన అడుగుజాడలలో తెలుగు తమ్ముళ్లు నడిస్తేనే, ఆ యుగ పురుషుని వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గుడిపూడి మోహన్ రావు, రావూరి సతీష్, గజ్జల రామ శేఖర్, గుడిపూడి కృష్ణార్జునరావ్, సామినేని సాయి, ఎం. అనిల్, నెల్లూరి రవి, మూడు కృష్ణ, రాయల సంపత్, ఎం.సత్యం, రాయల రాజేష్, పోటు పార్ధు, జి.సాయి, బద్రు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మదిలో నిలిచిన ఎన్టీఆర్







**ఇల్లందు, జనవరి 18, ప్రజాజ్యోతి:**

ఇటు సినిమా రంగం, అటు రాజకీయాల్లో ఉంటూ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల మదిలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నిలిచారని తెలుగుదేశం పార్టీ ఇల్లందు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ పేర్కొన్నారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక పార్టీ కార్యాలయంలో తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముద్రగడ వంశీ మాట్లాడుతూ ఎన్టీఆర్ అనేది ఒక చరిత్ర అని, తెలుగు ప్రజల ఆత్మగౌరవని ప్రపంచానికి చాటి చెప్పిన మహా నాయకుడు ఎన్టీఆర్ అని, సంక్షేమ పథకాలకు ఆధ్యుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగు రాష్ట్రాల్లో కాకుండా భారతదేశ మొత్తం ఆయన మొదలుపెట్టిన పథకాలను ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. ఎన్టీఆర్ చూపించిన మార్గంలోనే ముందుకు నడుస్తామని రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీ బలమైన శక్తిగా ఎదిగి ఈ రాష్ట్రంలో కీలకంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చాందావత్ రమేష్ బాబు, సీనియర్ నాయకులు శ్యామ్ తీవారి, కారు నర్సన్న, అయ్యోరి నాగరాజు, దాసరి గోపాలకృష్ణ, కొబ్బరి శివ, పొదిల శ్యామ్, దేవరకొండ నవీన్, గోగ్గెల రాజేష్, నిమ్మల మహేష్, సతీష్, ప్రణయ్, నిఖిల్, శ్రావణ్, రాము, ముకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



**దమ్మపేట, జపవరి 18 ప్రజాజ్యోతి:**

ఆంధ్రుల ఆరాధ్య నాయకుడు , వెండితెర వేల్పు , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి , దివంగత నేత నందమూరి తారక రామారావు 29 వ వర్ధంతి వేడుకలు శనివారం దమ్మపేట మండల వ్యాప్తంగా పార్టీల తారతమ్యం లేకుండా ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన సేవలకు వెలకట్టలేమని జారే అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణీ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్, మండల నాయకులు ఎర్రా వసంతరావు తధితరులు పాల్గొన్నారు.

## గామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ



**టేకులపల్లి, జనవరి 18, ప్రజాజ్యోతి:**

గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ సీఈఓ దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు పిఓ బి.రఘునాయక్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని బేతంపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని తెల్ల రేషన్ కార్డులు ఉన్న 160 కుటుంబాలకు నిత్యవసర సరుకులు, ఆర్థిక భద్రతలో భాగంగా 50 కుటుంబాలకు రూ. 50వేలను వితరణగా అందజేశారు. ఈ సేవను తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉంటుందని, గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఉపాధ్యక్షులు సామినేని తిరుపతయ్య చౌదరి, జనరల్ సెక్రెటరీ కాకపాటి సౌజన్య, రేషన్ కార్డు కలిగి ఉన్న పేదలకు సరుకులను అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పేదలు ఉపయోగించుకోవాలని కోరారు.

## మల్లారం డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఉద్రిక్తత



**దమ్మపేట, జనవరి 18 ప్రజాజ్యోతి:**

దమ్మపేట మండల కేంద్రంలోని మల్లారం డబుల్ బెడ్ రూమ్ కాలనీలో అసంపూర్తిగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ గృహాలలో పరదాలు కట్టి నివాసం ఉంటున్న ప్రజలను స్థానిక రెవెన్యూ సిబ్బంది పోలీసుల సహకారంతో శనివారం ఖాళీ చేయించారు. ఈ క్రమంలో నివాసం ఉంటున్న ప్రజలకు, పోలీసులకు వాగ్వివాదం జరిగి కొంత మంది పెట్రోల్ పోసుకోని బెదిరింపు చర్యలకు పాల్పడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు వారిని తక్షణమే అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జారే శంకుస్థాపన





**దమ్మపేట, జపవరి 18 ప్రజాజ్యోతి:**

అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ శనివారం మండల పరిధిలోని పలు గ్రామాలలో సుమారు 3.66 కోట్ల నిధులతో మంజూరు అయిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. రాచూరి పల్లి, తాటిసుబ్బన్నగూడెం పంచాయితీ లలో నూతనంగా నిర్మించిన పంచాయితీ కార్యాలయాలకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాచూరి పల్లి పంచాయితీ కార్యాలయ భవనానికి స్థలాన్ని దానంగా అందించిన సీనియర్ నాయకులు కక్కిరాల రత్నాకర్ రావు ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్లజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యుగపురుషుడు ఎన్టీఆర్ కు మరణం లేదు

### ఎండీ వలీపాష

**దమ్మపేట, జనవరి 18 ప్రజాజ్యోతి:**

తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదంతో ఒక రాజకీయ పార్టీ పెట్టి కేవలం 9 నెలలోనే అధికారం చేపట్టిన ఘనమైన చరిత్రగల నాయకుడు యావత్ భారతావనిలో నందమూరి తారక రామారావు ఒక్కరే అని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఎండీ వలీపాష అన్నారు. శనివారం ఆ మహనీయుని 29వ వర్ధంతిని పురస్కరించుకుని మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని దమ్మపేట, పట్వారి గూడెం, నాగుపల్లి గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వలీపాష, సోసైటీ ఉపాధ్యక్షులు కట్టం ఎర్రప్పలు మాట్లాడుతూ ఈ భూమి ఉన్నంత కాలం తెలుగుజాతి ప్రజల హృదయాలలో సుస్థిరంగా ఎన్టీఆర్ ఉంటారని, అప్పటి కేంద్ర ప్రభుత్వాల అహంకార ధోరణికి వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీని స్థాపించి, రాష్ట్రం లో అధికారం చేపట్టడంతో పాటు, కేంద్రప్రభుత్వ కూటమికి కన్వీనర్ గా ఉండి రాష్ట్రం లో పలు ప్రజారంజక పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత కేవలం ఎన్టీఆర్ కు మాత్రమే దక్కుతుందని తెలియజేశారు. ఎన్టీఆర్ భౌతికంగా మనమధ్య లేకపోయిన తెలుగు ప్రజల హృదయాలలో ఎప్పుడూ బ్రతికే ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడీపీ సీనియర్ నాయకులు గడ్డిపాటి సత్యం, సోసైటీ డైరెక్టర్ బొల్లికొండ నాగేశ్వరరావు, వట్టి రమేష్, కాసాని నాగప్రసాద్, భోగి సత్యం, కొండపల్లి కృష్ణమూర్తి, నాయుడు వీరస్వామి, నాయుడు సుబ్బారావు, బంధం శ్రీనివాసరావు, ఎస్ కే మౌలాలీ, ఊకే కుమారి, అర్జున్, డాక్టర్ రాము, పుష్పారావు, వెంకటేశ్వరరావు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## 19 మందికి కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణి

### – పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అందించడమే మా లక్ష్యం.. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**ఆళ్ళపల్లి. జనవరి 18. ప్రజాజ్యోతి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్ళపల్లి మండల పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి రైతు వేదిక లో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆళ్ళపల్లి మండలానికి చెందిన 19 మందికి 19,02204 లక్షల విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలియజేసిన. పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు. ఆళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాయం రామనరసయ్య. కాంగ్రెస్ మండల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# డార్మెటరీ, డైనింగ్ నిర్మాణానికి స్థలపరిశీలన

**భద్రాచలం, జనవరి 18 ప్రజాజ్యోతి:**




ఇంటిని మరిపించేలా గిరిజన విద్యార్థులకు చదువుతో పాటు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించడానికి విశాలంగా ఉండే డార్మెటరీ, డైనింగ్ లా ఏర్పాటుకు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ శనివారం స్థలపరిశీలన చేశారు. గిరిజన సంక్షేమశాఖ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, గ్రంథాలయాన్ని సందర్శించి ప్రత్యేక డిజైనింగ్ నిర్మాణం చేసేందుకు స్థలాలను ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా డార్మెటరీ, డైనింగ్ హాల్ నిర్మాణానికి హైదరాబాద్ నుంచి డిజైనింగ్ చేయడానికి డిజైనర్లను తీసుకురావడం జరిగిందని, వారి సమక్షంలో ఎంత స్థలం కావాలో పరిశీలించి నిర్మాణం చేపట్టేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం పంచాయతీ ద్వారా నడిపే కేసీఆర్ కాలనీలోని నర్సరీని సందర్శించి ప్రజలకు అవసరమైన మొక్కలు పెంచాలని, పండ్లమొక్కలతో పాటు మునగ చెట్లు, వెదురు మొక్కలు పెంపకాన్ని చేపట్టాలని నర్సరీ నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో అశోక్ కుమార్, డీఈ హరీష్, టీఎస్ శ్రీనివాస్, జీపీఈవో శ్రీనివాస్, ఏపీఎం అపర్ణ, హెచ్ఎంలు వెంకటేశ్వరచారి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

# యువకుడు ఆత్మహత్యయత్నం

**–మృతి చెందిన యువకుడు**

**–లోన్ యాప్ వేధింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు**

**ఇల్లందు, జనవరి 18, ప్రజాజ్యోతి:**



ఆన్లైన్ లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక ఇల్లందు పట్టణానికి చెందిన సంతోష్ లోద్ అనే యువకుడు శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. శనివారం రాత్రి ఖమ్మం ఓ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందు పట్టణంలోని 4వ వార్డుకు చెందిన సంతోష్ లోద్ (21) ఆన్ లైన్ లోన్ యాప్ ద్వారా లోన్ తీసుకున్నట్లు తెలిపారు. సుమారు రూ. లక్ష వరకు లోన్ యాప్ ద్వారా లోన్ పొందినట్లు, అందులో రూ. 48 వేల వరకు చెల్లించారన్నారు. గత కొంతకాలంగా కొన్ని ఇబ్బందుల వల్ల మిగిలిన డబ్బులు కట్టలేక పోతున్నాడని, దీంతో నిర్వాహకులు ఫోన్లు చేస్తూ వేధించడంతో పాటు లోన్ కట్టకపోతే కుటుంబ సభ్యుల ఫోటోలను మార్ఫింగ్ చేసి తెలిసిన వారందరికీ పంపుతామని బెదిరించారని పేర్కొన్నారు. మనోవేదనతో కుటుంబ పరువు పోతుందనన్న బాధతో శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించగా ఓ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# మారుతి నర్సింగ్ కళాశాలలో 69 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామకాలు




**భద్రాచలం టౌన్, జనవరి 18 ప్రజాజ్యోతి:**

భద్రాచలం పట్టణంలోని మారుతి నర్సింగ్ కళాశాలలో జీఎన్ఎం నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన 69 మంది క్యాంపస్ సెలక్షన్లో హైదరాబాద్లోని ఓమెగా గ్రూఫ్ ఆఫ్ హాస్పిటల్స్లో 32, కిమ్స్ ఆసుపత్రి సికింద్రాబాద్లో 17, భాస్కర మెడికల్ కాలేజ్ హాస్పటల్ హైదరాబాద్లో 20 మంది మొత్తం 68 మంది ఉద్యోగ నియామకాలు పొందినట్లు మారుతి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్ఎల్ కాంతారావు, చైర్మన్ బి.సుబ్బరాజులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. నర్సింగ్ వృత్తి పవిత్రమైందని, విధినిర్వహణ బాధ్యతతో చేపట్టాలని, స్పెషాలిటీ విభాగంలో నైపుణ్యత పెంచుకోవాలన్నారు. ఈ అవకాశం కల్పించిన కళాశాల యాజమాన్యం, ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలకు ఉద్యోగం పొందిన విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# ఎల్అండ్ చైర్మన్ వ్యాఖ్యలు ఉపసంహరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతాం

**సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్**




**భద్రాచలం టౌన్, జనవరి 18 ప్రజాజ్యోతి:**

ఎల్అండ్ కంపెనీ చైర్మన్ సుబ్రహ్మణ్యం వారానికి 90 గంటలు పనిచేయాలని, ఆదివారం కూడా పనిచేయాలని, ఇంట్లో కూర్చుని భార్య ముఖం చూస్తూ కూర్చుంటారా అని చేసిన వ్యాఖ్యలు కార్మికవర్గం మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని వెంటనే వ్యాఖ్యలు ఉపసంహరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి దిగుతామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ హెచ్చరించారు. శనివారం భద్రాచలం చంద్రరావు భవన్లో లో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పోరేట్లు పెద్ద పెద్ద పెట్టుబడిదారులు తమ లాభాల రేటును పెంచుకోవడానికి కార్మికులు, ఉద్యోగులను పీల్చిపిప్పిచేయడానికి పని గంటలను పెంచాలని తరచూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లు కార్మికులను ఇబ్బందులు పెట్టేందుకు తీసుకువచ్చిందనడానికి ఇదే ఉదాహరణ అన్నారు. వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, వేతనాలు నెలనెలా ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా కార్మికులతో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, పట్టణ నాయకులు వై. వెంకటరామారావు, బండారు శరత్ బాబు, నకిరికంటి నాగరాజు, లక్ష్మణ్, యూనైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సురేందర్, గంగ, సంతోష్, రవి, రమ, నరేందర్లు పాల్గొన్నారు.

# అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

**గిరిజన సంఘం నాయకులు మధు**

**జూలూరుపాడు, జనవరి 18 ప్రజా జ్యోతి:**



ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం అమలు చేయాల్సిన 6 గ్యారంటిలలో ఒకటి కోత్త రేషన్ కార్డు కోసం చాల మంది నిరుపేదలు దరఖాస్తులు చేసుకుంటే అధికారులు మాత్రం అర్హతలు ఉన్న పేద వారికి మాత్రం రేషన్ కార్డులు మంజూరు చేయాలని గిరిజన సంఘం నాయకులు భానోత్ మధు డిమాండ్ చేశారు . గత పది సంవత్సర కాలం నుండి ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న రేషన్ కార్డుల సమస్య తీవ్రంగా ఉన్నదని కానీ ఇప్పుడు రేషన్ కార్డులు ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఏ ప్రాతిపదికన మంజూరు చేసారో తెలియని పరిస్థితి నెలకొన్నదని , రేషన్ కార్డులకోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నా నిరుపేదలకు నేడు విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు లేవని దీనితో తమకు నిరాశ మిగిలిందని అన్నారు గతంలో గ్రామపంచాయితీలల్లో ఎంపీడీఓలకు దరఖాస్తులు చేసుకున్నామని ఎలాంటి విచారణ జరిపారు అనేది సందేహం గా మిగిలింది అన్ని అర్హతలు ఉన్న లబ్ధిదారులకు... రేషన్ కార్డులు ఎందుకు రాలేదో ప్రభుత్వ అధికారులు ప్రజలకు వివరణ ఇవ్వాలని అన్నారు. ఇది నిరంతర ప్రక్రియన లేక ముగింప అని ఆందోళనలో ఉన్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ అర్హతలు ఉన్న వారందరికీ కోత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గుండెపోటుతో కౌన్సిలర్ తోట లలితా శారద భర్త మృతి

**ఇల్లందు, జనవరి 18, ప్రజాజ్యోతి:**



ఇల్లందు మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ తోట లలితా శారద భర్త తోట రమేష్ (58) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీ పాషా, వార్డు కౌన్సిలర్ యలమందల వీణ, జెకె శ్రీనివాస్, పాబోలు స్వాతి, వాంకుడోత్ తార, బిఆర్ఎస్ నాయకులు లక్కినేని సురేందర్, పరుచూరి వెంకటేశ్వర్లు, లాల్ సింగ్, ఖమ్మంపాటి రేణుక, యలమద్ది రవి, పాబోలు మణి కిరణ్, బొమ్మెర్ల వరప్రసాద్, డెరంగుల పోషం, అబ్దుల్ నబి, గిన్నారపు రాజేష్, సత్తాల హరికృష్ణ, సన రాజేష్ లు తోట రమేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



# ఎన్టీఆర్ ది అసామాన్య చరిత్ర

**తెలుగు వారికి కీర్తిప్రతిష్టలు తెచ్చిన ఘనత ఆయనది..**

**టిటిడిపి మండల అధ్యక్షుడు నార్లపాటి శ్రీనివాసరావు**

**అశ్వారావు పేట, జనవరి 18, ప్రజాజ్యోతి:**



తెలుగువారి కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత నందమూరి తారక రామారావుదని అటువంటి మహనీయుని సృష్టి ఉన్నంత కాలం ప్రజలు మరువలేరని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నార్లపాటి శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని వివేకానంద కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి తెదేపా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తెచ్చిన చరిత్ర ఎన్టీఆర్ దని అధికారం అంటే ఆస్వాదించడానికి కాదు ప్రజలకు సేవచేయడానికి అని చేసి చూపిన నిస్వార్థ నాయకుడు ఆయనేనన్నారు. సమాజంలోని కొన్ని వర్గాలకే పరిమితమైన అధికారాన్ని అట్టడుగు స్థాయిలో ఉన్న అణగారిన వర్గాలకు చేరువ చేసి వారిని రాజకీయంగా నిలబెట్టారన్నారు. సంక్షేమ పథకాలను నిరుపేద ప్రజలకు అందించి వారి గుండెల్లో చిరంజీవిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంకోలు వెంకటేశ్వరరావు, నర్రా రాకేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.